పార్కింగ్ ఇలా..

ఇళ్లకు వెళ్లేదెలా?





కాలనీలు, బస్తీల్లోని రోడ్లకు ఇరువైపులా వివిధ రకాల వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తతలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురికాలనీలోని ఐదు కాలనీ అంతర్గత రహదారుల్లో ఏ రోడ్డులో చూసిన ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో నిండిపోతుంది. జాతీయ రహదారికి అనుకుని ఉండటం.. కాలనీ అంతర్గత రహదారుల పొడవునా అనధికార బస్టాపులు ఉండటంతో కాలనీ వాసులు కాలనీలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో వాహనాల శబ్దాలతో కాలనీవాసులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. వాహనాల పార్కింగ్‌ను అడ్డుగా చేసుకుని మలమూత్ర విసర్జనాలతో దుర్వాసన వస్తోందని ఈ సమస్యలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. –మన్సూరాబాద్

రోడ్డంతా చెత్త.. తరలించకుంటే ఎట్టా?

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీలలో రోడ్ల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. పేరుకుపోయిన చెత్తలో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు, అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని సాయంత్రం అయితే దోమలు విజృంభించి రోగాల బారిన పడేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –వనస్థలిపురం



మురుగు పరుగు.. పరిష్కారం దేవుడెరుగు



డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల జామై మురుగు రోడ్లపై ఏరులై పారుతుండంతో కంపు కొడుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. రామకృష్ణాపురం డివిజన్ పరిధి కాలనీల్లో మురుగు పరుగు పెట్టడం నిత్యకృత్యమైంది. ఏ రోడ్డు చూసినా మురుగు పారుతూనే ఉంది. ఎన్‌టీఆర్‌నగర్ బస్తీలు, సిరినగర్, యాదవనగర్, అల్కాపురి తదితర కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. మురుగు పారుతుండటంతో దుర్వాసన వచ్చి రోగాలబారిన పడుతున్నామని ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీలలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుందని కాలనీవాసులు కోరుతున్నారు. –దిల్‌సుఖ్‌నగర్

క్లుప్తంగా

10న బీసీ ఆత్మీయ సమ్మేళనం

మన్సూరాబాద్: బీసీ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 10న మన్సూరాబాద్ ఎంతరెడ్డి గార్డెన్స్‌లో బీసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్రగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య, పాలూరి లక్ష్మి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ ఉద్యమం–రాజ్యాధికారం దిశగా తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

పైపులైన్ ఏర్పాటుతో కలుషిత నీటికి చెక్



పనులకు శంకుస్థాపన చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పద్మానగర్ కాలనీలో కాలం చెల్లిన పైపులైన్ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేయటంతో నీటి కలుషితానికి చెక్ పడుతుందని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించనున్న తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జయవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, రామకృష్ణ, హరిహరరావు, రాఘుమారెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, లింగాల దశరథగౌడ్, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న యెచ్చు సునీల్

నాగోలు: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాబోయే ఉప ఎన్నికల్లో నిరుద్యోగులు తమ హక్కులను కాపాడుకోవడానికి, తమ సమస్యలను పరిష్కారం కోసం విద్యార్థుల రాజకీయ పార్టీ(వీఆర్‌పీ) వేదికగా ఏకమై పోరాడాలని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు యెచ్చు సునీల్ అన్నారు. సోమవారం నాగోలు అల్కాపురిలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న చేత కేవలం స్వార్థపూరిత ప్రయోజనాల కోసం కొత్తపార్టీ సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల రాజకీయ పార్టీ (వీఆర్‌పీ) ప్రారంభం నుంచే ఉచిత విద్యా, వైద్య సేవలను కార్పొరేట్ స్థాయిలో అందించాలనే ధ్యేయంతో ప్రజా పోరాటం చేస్తూ వచ్చిందని తెలిపారు. ఈ ఉద్యమాన్ని అడ్డుకోవడం, దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్న వారిని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నిరుద్యోగులు గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో కమలాకర్, గోకికార్, అనిల్‌కుమార్, అనికేత్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.20, వంకాయ రూ.25, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.12, క్యారెట్ రూ.40, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.25, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.18, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.25, మునగ రూ.75, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.53. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



స్నేహపురికాలనీలో వేంకటేశ్వర స్వామి మన్యుసూక్త హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: చంద్రగ్రహణం నేపథ్యంలో కొత్తపేట డివిజన్‌లోని ఆలయాలు ఆదివారం మూసేసి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రధాన వేంకటేశ్వరాలయం, విజయ వినాయక స్వామి, అన్నపూర్ణా దేవి, సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని శ్రీరామ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, కొత్తపేట పురాతన భకాంజనయ స్వామి ఆలయం, ఎస్‌బీహెచ్‌కాలనీలో, సత్యానగర్ కాలనీల్లో ఆలయాల సముదాయం హరిహర క్షేత్రంలోనూ ఉదయం నుంచి సంప్రోక్షణ తర్వాత యాథావిధిగా స్వామి వార్లకు పూజలు నిర్వహించారు.

కాలనీవాసులకు అనుకూలంగానే అభివృద్ధి పనులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని వారికి అనుకూలంగానే అభివృద్ధి పనులు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ డిమాండ్ చేశారు. ఆగమయ్యనగర్‌కాలనీలో జరుగుతున్న భూగర్భ వరద కాలువ పనులపై కాలనీవాసులు అభ్యంతరాలు తెలపడంతో సోమవారం ఆ ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. కాలనీ మీదుగా జరుగుతున్న భూగర్భ వరద కాలువ పనులతో మంచినీటి పైపులైన్లకు, డ్రైనేజీ వ్యవస్థకు ఇబ్బందులు తలెత్తే అవకాశమందని కాలనీవాసులు అభ్యంతరం తెలుపుతున్నారన్నారు. కాలనీవాసులు అభిప్రాయం ప్రకారం కేఎల్‌ఎం ప్రాంతం నుంచి నేరుగా పెద్దచెరువు బాక్స్ టైప్ నాలాకు వరదకాలువను మళ్లించాలని అధికారులను కోరుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరమ్మయాదవ్, యాదయ్య, బాల్‌రాజ్‌గౌడ్, ఆంజనేయులు, వెంకటయ్యగౌడ్, వెంకటచారి, లచ్చిరెడ్డి, గోవర్ధన్, ముత్రం, సుధ, సుజాత, శ్రీరాములు పాల్గొన్నారు.

టెలిఫోన్ కాలనీలో చిన్నారికి డెంగీ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీసీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ ఓ డెంగీ కేసు నమోదు కావడంతో సరూర్‌నగర్ డీసీ భువనగిరి శ్రీనివాస్, ఎంటమాలజిస్ట్ అధికారులు సోమవారం కాలనీలో పర్యటించారు. రోడ్డు నెంబర్–6లో ఉంటున్న ఓ చిన్నారి (12)కి డెంగీ రావడంతో బంజారాహిల్స్‌లో రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వారానికి ఒకసారి డ్రై డే పాటించాలి నీటి నిల్వలను తొలగించి దోమల వృద్ధిని అరికట్టాలన్నారు. ముఖ్యంగా తాగునీటిలో పుట్టే దోమలతో డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వచ్చే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, సూపర్‌వైజర్ శ్యాంసుందర్, డీఎంఓ స్టాఫ్ పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీఉద్దీన్ సోమవారం సర్కిల్–1 ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి రేషన్‌కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా ఏఎస్‌ఓ సానుకూలంగా స్పందించాలరన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కన్నా సంవత్సర కాలంలో వికలాంగుల సమగ్ర అభివృద్ధికి పాటు పడ్డామన్నారు. వికలాంగులకు ఉన్నత విద్య, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, కోర్టు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించామన్నారు. వికలాంగుల కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలు అందేలా చట్టం చేశామన్నారు. స్పోర్ట్స్ పాలసీ ద్వారా వికలాంగులకు ప్రోత్సహకాలు అందిస్తున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మురకుంట్ల అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మెతరి సుశీలమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.68 వేల చెక్కును సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశాడు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సాజిద్, కంచర్ల శేఖర్, వెంకటేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, రమేష్ కురుమ పాల్గొన్నారు.

తొలగించారు.. వదిలేశారు



మూసారంబాగ్ మెట్రోస్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై చెట్ల కొమ్మలు

మలక్‌పేట: ఫుట్‌పాత్‌పై చెత్తా చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు ప్రధాన, అంతర్గత రహదారుల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి వాటిని తరలించకుండా అలాగే వదిలేశారు. మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్ కాలనీలలో కూడా ఇదే దుస్థితి. మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా సలీంనగర్‌లో మూసారంబాగ్ మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై నెలల తరబడి ఉన్నా వాటిని తరలించడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని పాదచారులు వాపోతున్నారు. సంబంధిత సిబ్బంది స్పందించి ఫుట్‌పాత్‌లపై ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్‌కు వివరిస్తున్న కాలనీవాసులు

చైతన్యపురి: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహాగుప్తా అన్నారు. డ్రైనేజీ సమస్యపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన చైతన్యపురి కాలనీలో పర్యటించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ద్వారకాపురి కాలనీలో పాముల బెడద సమస్యపై ఆ కాలనీలో పర్యటించి చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నాగోలు: ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే వారు మాత్రమే కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే గొప్ప శిల్పులని కొత్తపేట హైస్కూల్ మాజీ ప్రధానోపాధ్యాయులు విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో విజయేందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో ఎంతో గౌరవం ఉందన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట రిటైర్డ్ గవర్నమెంట్ ఉద్యోగి వీరమల్ల వాసుదేవ్, భాగ్యమ్మ, ప్రధానోపాధ్యాయులు నరసింహ, కృష్ణారెడ్డి, ఉమారాణి, చంద్రలేఖ, శైలజ, జితేందర్‌రెడ్డి, రమేష్, శాంతా సాయి, జ్యోతి, భారతి, శ్రీలత, స్వరాజ్యలక్ష్మి, రజిని, మమతా, సృజనను విద్యార్థులు సన్మానించారు.

టెక్నికల్ ఉపాధ్యాయులకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మంత్రి వివేక్, ముఖ్య కార్యదర్శి దానకిషోర్

నాంపల్లి: రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం(టెక్నికల్) వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఉపాధ్యాయులను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణా సంస్థ జాయింట్ డైరెక్టర్ నగేష్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రాజా, డిప్యూటీ డైరెక్టర్ నర్సయ్య, జాయింట్ లేబర్ కమిషనర్ గంగాధర్, ట్రెనింగ్ ఆఫీస్ ఎం.బి. కృష్ణయాదవ్, మల్లేపల్లి ప్రిన్సిపాల్ శైలజ, శాంతినగర్ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్ వద్ద వ్యర్థాల తొలగింపు

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద వినాయక నిమజ్జనాలు సోమవారం కూడా కొనసాగాయి. ఇప్పటి వరకు సుమారు ఆరువేల విగ్రహాలు నిమజ్జనం అయినట్లు అధికారులు తెలిపారు. చెరువులో విగ్రహాలు, ఇనుపగ్రిల్స్, కర్రలు ఎప్పటికప్పుడు బయటకు తీస్తున్నారు. నిమజ్జనం సందర్భంగా వచ్చిన వ్యర్థాలను జీహెచ్‌ఎంసి సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు మినీట్యాంక్ బండ్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



వ్యర్థాలను తరలిస్తున్న జీహెచ్‌ఎంసి సిబ్బంది



చెరువులోని వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

మంత్రికి వినతి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం మంత్రి శ్రీధర్ బాబును కలిసి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అనిమేస్టడీస్‌తో కియోటో సేకా వర్సిటీ పరస్పర ఒప్పందం

నాంపల్లి: మల్టీమీడియా గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌లు భారతదేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఏఏసీజీ మల్టీ మీడియా కళాశాల, జపాన్‌లోని మంగ అండ్ అనిమేస్టడీస్‌లో ప్రపంచంలోనే మొదటి అగ్రగామి విశ్వవిద్యాలయమైన కియోటో సేకా యూనివర్సిటీతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకోబోతోంది. ఈ ఒప్పందం ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు సమయంలో హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఈ నెల 10న జరుగుతుంది. ఈ అవగాహన ఒప్పందాన్ని ఐఏసీజీ వ్యవస్థాపకుడు రామకృష్ణ, కియోటో సేకా యూనివర్సిటీ సెంటర్ ఫర్ రీసెర్చ్ అన్ కాంటెంపరరీ ఆఫ్రికన్ అండ్ ఏషియన్ కల్చర్స్ డైరెక్టర్ షిన్ మత్సుమురా పరస్పరం మార్చిడి చేసుకుంటారు. ఈ విషయాన్ని ఐఏసీజీ సీఈఓ డాక్టర్ సురేష్ మదిరాజు, ఐఏసీజీ అకాడెమిక్స్ హెడ్ చైతన్య రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ అవగాహన ఒప్పందంతో భారత్–జపాన్ మధ్య విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

హుస్సేన్‌సాగర్‌కు మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



అబిడ్స్: హుస్సేన్‌సాగర్‌కు మురుగునీటి ప్రవాహం రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొబ్బరి నీళ్లతో హుస్సేన్‌సాగర్ నింపుతామన్న ఆయన కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలన్నారు. గణేష నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్‌సాగర్‌కు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మురుగునీటిలో దురదృష్ట వశాత్తు మనం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నామన్నారు. హుస్సేన్‌సాగర్‌కు ఏ ప్రాంతం నుంచి అయినా మురుగునీరు రాకుండా డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలిస్తే హుస్సేన్‌సాగర్‌ను మంచినీళ్లతో నింపవచ్చని రాజాసింగ్ అన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రాబోయే సంవత్సరంలోనైనా వినాయకుడి నిమజ్జనాన్ని మంచినీరు కలిగి ఉండే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

చాదర్‌ఘాట్: అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కట్టేలగూడ నివాసముంటున్న అమీరా ఫాతిమా(19) లార్డ్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం చదువుతోంది. సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో వారుంటున్న అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు

అబిడ్స్: విద్య, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలు చేస్తున్న డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డు–2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. 25ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఓజోన్‌పొర పరిరక్షణ వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రజలను, విద్యార్థులను, యువతను చైతన్యపరుస్తున్న కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఈ అవార్డు అందజేసి ఘనంగా సత్కరిస్తామని వివరించారు. సమాజానికి చేసిన సేవలను గుర్తించి ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి ఆయన ఒక్కరికే ఈ అవార్డు అందజేస్తున్నట్లు రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు.

ఎంవీఎస్ఆర్‌లో ఓరియంటేషన్ డే

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏర్‌సీఐ సైంటిస్ట్ డా.ప్రమోద్ హెచ్ బోర్సే, ముఖ్యులుగా కళాశాల చైర్మన్ పీవీఆర్ కశ్యప్, కార్యదర్శి డా.కేపీ శ్రీనివాస్‌రావు, కోశాధికారి సుధాకర్ జుపుడి, జాయింట్ సెక్రటరీ సూర్యప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ఆధునిక ఇంజనీరింగ్ రంగంలో అంతర్రాష్ట్ర విజ్ఞానం, పరిశోధనల ప్రాధాన్యత, సుస్థిర అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంత ముఖ్యమో విద్యార్థులకు వివరించారు. సాంకేతిక నైపుణ్యాలను సామాజిక బాధ్యతతో కలిపి అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కామేశ్వర్‌రావు, సీపీ వర్ధని, ప్రసన్నకుమార్, కె.వేణుగోపాల్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

లంగర్‌హౌస్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతు మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..రాజేంద్రనగర్ మండలం పీఅండ్‌టీ కాలనీకి చెందిన షేక్ జునీద్(22) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 6న అర్ధరాత్రి తన బైక్‌పై మెహిదీపట్నం నుంచి తన నివాసానికి వస్తున్నాడు. లంగర్‌హౌస్ పీ ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభం వద్ద మిలటరీ ఆస్పత్రి ముందు తన వాహనాన్ని నిలిపాడు. అటు వైపు ఉన్న హోటల్‌కి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలు విరిగి, తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రితో చికిత్స పొందుతూ జునీద్ సోమవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.